# ఇంకెన్ని భయాలు చూడాలో

చీకటిని చూసి భయపడే వారిని చూసాను.
శబ్దానికి భయపడే వారిని చూసాను.
అమ్మా నాన్నల తాత్కాలిక వేర్పాటుకు భయపడే వారిని చూసాను.
కింద పడి దొర్లి ఏడ్చే వారిని చూసాను.
పాఠశాల చూసి భయపడే వారిని చూసాను.
మాష్టరు కొట్టే బెత్తం దెబ్బకు భయపడే వారిని చూసాను.
పిల్లిని చూసి భయపడే వారిని చూసాను
బొద్దింకను చూసి భయపడే వారిని చూసాను
రూపం బాగోలేదేమోనని భయపడే వారిని చూసాను.
ప్రేమ వ్యక్తీకరించడానికి భయపడే  వారిని చూసాను
ప్రేమను స్వీకరించడానికి భయపడే వారిని చుసాను
భయపడే శత్రువును చూసి భయపడే వారిని చూసాను
భాద్యతలు నిర్వర్తించలేనేమోనని భయపడే వారిని చూసాను.
వైఫల్యం చూసి భయపడే వారిని చూసాను.
స్థానం కోల్పోతామేమో అని భయపడే వారిని చూసాను.
వృద్ధాప్యంలో ఒంటరి తనాన్ని చూసి భయపడే వారిని చూసాను.
మరణాన్ని చూసి భయపడే వారిని చూసాను.

కానీ ప్రస్తుతపు సమాజంలో మరిన్ని భయాలు చూస్తున్నాను.
ఒక కులం మరో కులాన్ని చూసి వణుకుతుంది –
అధికారం కోల్పోతామేమోననే  భయం.
ఓ వర్గం ఇంకో వర్గం పై అణచివేతను ప్రదర్శిస్తుంది –
ఆస్తులు పోతాయేమోననే  భయం.
అజమాయిషీ పోతుందేమోనని భయం.
బోడి పెత్తనం పోతుందేమోనని భయం.
ఒక రైతు తన పంటను చూసి వణుకుతున్నాడు –
ధర వస్తుందో రాదో అనే భయం.
ఒక కూలీ పట్టణం చేరి ఎదురు చూస్తున్నాడు –
పని దొరుకుతుందో  లేదో అనే భయం.
ఒకరికి – ఈ దేశం నుంచే తరిమివేస్తారేమోననే  భయం.
రెండూ  దళిత కులాలు  మాల, మాదిగ –
ఎవరికి ఎవరూ తోడ్పడకుండా   గోడలు కట్టుకున్న రోజులు.
ప్రభుత్వంలో ఉద్యోగికి – స్థాన చలన భయం.
ప్రైవేటులో ఉద్యోగికి – ఉద్యోగమే పోతుందేమోననే  భయం.
తల్లిదండ్రుల గుండెల్లో కొడుకు రోడ్డెక్కితే వస్తాడో రాడో అని భయం,

కూతురు బయటికి వెళ్ళితే వస్తుందో రాదోననే భయం.
నిజం చెబితే లక్ష్యమవుతామేమోననే భయం.
విలేకరులు వాస్తవాలు రాయాలంటే భయం-
ప్రకటనలు ఆగిపోతాయేమోననే భయం
కూలీ జెండా ఊపుతూ వేరేలా ఆలోచించాలంటే భయం -
కులస్తులు శత్రువులమవుతామేమోననే భయం
ప్రతిభ ఉన్నవాడిని చూస్తే ప్రతిభ లేనివాడికి భయం.
ఈ భయం – సమాజం మొత్తం కమ్ముకున్న పొగమంచు.
ఈ భయం – జీవితాలపై బరువైన గొలుసు.
కానీ గుర్తుంచుకో – భయం నిన్ను బంధిస్తుంది,
ధైర్యం నిన్ను విడుదల చేస్తుంది.
ఈ దేశ గీతం ధైర్యమే కావాలి. ఎందుకంటే –
నైతికతకు భయం అంటే అసహ్యం, న్యాయానికి ధైర్యమే సత్యం.

- మీ విజయ్ చంద్ర